
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
ఆదివారం 9 జూన్ 2024



జనగామలో ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా



'గులాబీ'కి మరో దెబ్బ!

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలోనూ బీఆర్ఎస్ ఓటమి
- గతంలో ఇదే స్థానంలో నాలుగు సార్లు విజయం
- ఇటీవలి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కుదేలు
- కంచుకోటలో వరుస పరాజయాలతో కేడర్ పక్కచూపులు
- తొలిసారిగా పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ పాగా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న పోరుగల్లు.. ఓరుగల్లులో ఆ పార్టీకి మరో దెబ్బ తగిలింది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వరుస ఓటములు చవిచూసిన ఆ పార్టీకి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ పరాభవం తప్పలేదు. దాంతో కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలు బీటలు వారుతుండం.. వరుస పరాజయాలు ఎదురవుతుండటంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్న గులాబీ కేడర్ పక్క చూపులు చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే లోక్‌సభ ఎన్నికల్లో పరాజయంతో తీవ్ర నిరాశలో ఉండగా.. నాలుగు పర్యాయాలు విజయం సాధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ ఓటమి చవిచూడడాన్ని ఆపార్టీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. తమకు గట్టి పట్టున్న ఓరుగల్లులో పార్టీ బలహీన పడుతుంటే అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టడం లేదనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు కీలక నేతలు కారు దిగేందుకు రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. కొందరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లినట్టుగా సమాచారం.

పరాజయాలతో గులాబీ పరేషాన్

తెలంగాణ ఉద్యమంలో అండగా నిలిచిన పోరుగడ్డ ఓరుగల్లులో బీఆర్ఎస్‌కు వరుస ఓటములు మింగుడు పడటం లేదు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే విజయం సాధించారు. అంతేకాకుండా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను గెలుచుకుని బలమైన పార్టీగా ఆవిర్భవించింది. నాటి పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నుంచి కీలకమైన నేతలు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరారు. లీడర్, కేడర్‌తో బలంగా ఉన్న బీఆర్ఎస్ 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీ చైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలుచుకుని బలమైన శక్తి బీఆర్ఎస్ ఎదిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బలమైన రాజకీయ పక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కష్టకాలం మొదలైందనే చర్చ జరుగుతోంది. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో కేవలం జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లోనే బీఆర్ఎస్ గెలిచింది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. దీంతోపాటు పార్లమెంట్ ఎన్నికల వేళ స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కారు దిగి హస్తం గూటికి చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన కూతురిని కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దించి ఎంపీ గా గెలిపించుకున్నారు. కడియంతో పాటు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సైతం బీజేపీలోకి వెళ్లారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఎవరికివారు కాంగ్రెస్ లో చేరారు. వీరితో పాటు కీలక నేతలు చాలా మంది కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. ఈ నేపథ్యంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌ను బరిలో దించగా ఆయన మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఏ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ తన ప్రభావాన్ని చూపలేకపోయింది. పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో కొన్ని ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మిగతా ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగానే పోలింగ్ జరిగింది. బీఆర్ఎస్ మూడోస్థానానికి పరిమితం కావటంతో అప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఉన్న కేడర్‌కు మింగుడు పడకుండా తయారైంది. మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసిన మాలోతు కవితకు కూడా ఏ అసెంబ్లీ నియోకవర్గంలోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయారు. ఇక్కడ బీజేపీ బలంగా లేకపోవటంతో బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవటం కొంత ఉపశమనంగా భావిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీల్లో ఒక్కటి కూడా గెలవకపోవడం కేడర్‌లో నిరాశను నింపింది.

పట్టభద్రుల ఝలక్‌తో మరింత కుదేలు..

గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లోనూ ఎదురుదెబ్బలు తప్పటం లేదు. 2009 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలిచిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పట్టు నిలుపుకోలేకపోయింది. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఉద్యమ సమయంలోనే కాకుండా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వైపు నిలిచిన పట్టభద్రులు కాంగ్రెస్, బీజేపీలకు అవకాశం లేకుండా చేశారు. నాలుగు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థులకే పట్టం కట్టారు. అయితే గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వరరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఈ సిట్టింగ్ స్థానంలో తిరిగి గెలవాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలో దించింది. అయినప్పటికి రెండో ప్రాధాన్యత ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. దీంతో ఈ స్థానంలో తొలిసారి కాంగ్రెస్ పాగా వేసింది. కాగా, ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో ఉన్న గులాబీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటమి మరింత కుంగతీస్తోంది.

గులాబీ నేతల పక్కచూపులు..?

వరుస ఓటములతో రాజకీయ భవిష్యత్‌పై కొందరు నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్, బీజేపీల్లో చేరిపోయారు. చాలామంది నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై అభిమానం.. ఉద్యమం నుంచి వచ్చిన పార్టీ అన్న భావనతో కొనసాగుతున్నారు. కానీ తమ భవిష్యత్ దృష్ట్యా కొందరు పక్కచూపులు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్‌లో ఎంపీల ప్రమాణస్వీకారం తరువాత బీఆర్ఎస్ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఉమ్మడిజిల్లా ముఖ్యనేతలు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితోనే మంతనాలు చేస్తుండగా, మరికొందరు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పార్టీలో చేరే విషయమై చర్చలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని, ఇప్పటికే కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరనుండటం, రాష్ట్రంలో కాంగ్రెస్ వర్సెస్

మిగతా 6వ పేజీలో..

ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హాజరు కానున్న 3697 మంది అభ్యర్థులు

జనగామ కల్చరల్, జూన్ 8: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా చేపట్టే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం గ్రూప్-1 పరీక్ష నిర్వహించనుండగా జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బ్లాక్-ఏ, బ్లాక్ బీ, సెయింట్‌పాల్స్ హైస్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్, ఏకశిల డిగ్రీ కళాశాల, ఏబీవీ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రాజరాజేశ్వరి డిగ్రీ కళాశాల, శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల, ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏకశిల బీఈడీ కళాశాల, క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ఏ, బీ, సీ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

గ్రూప్-1 ప్రిలిమినరీకి జిల్లాలో 3697 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులను 9 గం.ల నుంచే పరీక్షా కేంద్రంలోకి

మిగతా 8వ పేజీలో..

లోక్ అదాలత్‌లో 5,147 కేసుల పరిష్కారం



జడ్జిమెంటు కాపీని అందిస్తున్న ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ

జనగామ కల్చరల్, జూన్ 8: జాతీయ లోక్ అదాలత్‌లో 5147 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.రవీంద్రశర్మ తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో నాలుగు బెంచ్‌లను నిర్వహించగా మొదటి బెంచ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ, కె.చంద్రశేఖర్, రెండో బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, అడ్వకేట్ సిహెచ్.కిరణ్ కుమార్, మూడో బెంచ్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత, అడ్వకేట్ జి.రేఖ, నాలుగో బెంచ్‌లో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డి.వెంకట్రాంనర్సయ్య పాల్గొన్నారు. 65 సివిల్ కేసులు, 1200 క్రిమినల్ కేసులు, 3882 ప్రీలిటిగేషన్ కేసులతో కలిపి మొత్తం 5147 కేసులు పరిష్కరించినట్లు రవీంద్రశర్మ తెలిపారు. కార్యక్రమానికి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలగందుల చంద్రరుషి, న్యాయవాదులు సహకారం అందించారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న రైతులు

అనుమతులున్నాయన్న అధికారులు

రద్దు చేయాలని గ్రామస్థుల డిమాండ్



వాగు నుంచి ఇసుక రవాణాను అడ్డుకుంటున్న రైతులు

దేవరుప్పుల, జూన్ 8: రంభోజీగూడెం-చిన్నమడూరు వాగులోంచి పాలకుర్తి మండలం చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం కోసం తరలిస్తున్న ఇసుక రవాణాను ఆయా గ్రామాల రైతులు అడ్డుకున్నారు. శనివారం పలు పార్టీల నాయకులతో కలిసి ఇసుక తోడే యంత్రాలను అక్కడి నుంచి తిప్పి పంపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, మైనింగు అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు కలెక్టర్ అనుమతులిచ్చారని, ఇసుకను అడ్డుకోవద్దని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ నాయకులు వంగ అర్జున్, మైదం జోగేశ్వర్, గొడుగు మల్లికార్జున్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. వాగులోంచి ఇసుకను తోడితే భూగర్భ జలాలు అడుగంటి పోయి బోర్లు వట్టిపోతాయని, వరిపంట పండక రైతులు తీవ్రంగా నష్టపోతారని వివరించారు. సోమవారం రోజున కలెక్టర్ వద్దకు వెళ్లి మాట్లాడతామని, అప్పటి వరకు ఇసుక రవాణాను నిలిపివేయాలని అధికారులను కోరారు.

కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం

రంభోజీగూడెం-చిన్నమడూరు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో రైతులు వాగు వద్దకు చేరుకుని ఇసుక తరలింపును అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రెండు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాగు వద్దకు చేరుకున్నారు. దీంతో ఇరుపార్టీల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి గెలిచి ఆరునెలలు కాకముందే వాగులోని ఇసుకను ఖాళీ చేయిస్తున్నారని బీఆర్ఎస్ కార్యకర్తలు అనటంతో ఆగ్రహించిన కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి దయాకర్‌రావు డబుల్‌బెడ్రూం ఇళ్లకు ఇసుకను తీసుకెళ్లలేదా.. అంటూ నిలదీశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇక్కడ రాజకీయాలు అవసరం లేదంటూ ఇరువర్గాలను వారించడంతో గొడవ సద్దుమణిగింది.



అభిరామ్ (ఫైల్)

అయ్యో పాపం!

ఊరకుక్కల దాడిలో బాలుడి మృతి

వివరాలు : 8వ పేజీలో..

- వాహనాల ఫిట్‌నెస్‌పై తల్లిదండ్రుల ఆందోళన
- 12 నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు
- జిల్లాలో 179 ప్రైవేట్ బస్సులు
- వాటిలో ఫిట్‌నెస్ లేని వాహనాలు 93
- పట్టించుకోని యాజమాన్యాలు, అధికారులు



బడి బస్సు భద్రమేనా?

జనగామ కల్చరల్, జూన్ 8: వేసవి సెలవులు ముగించుకొని బడులు తెరచుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 12 నుంచి బడులు పునఃప్రారంభిస్తోంది. ఇప్పటికే బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. కొంత దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకైతే ఆర్టీసీ బస్సుల్లోనే వెళతారు. కానీ చాలా ప్రైవేటు పాఠశాలలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు స్కూలు బస్సుల్లోనే వస్తుంటారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 179 ప్రైవేటు పాఠశాలల బస్సులుండగా కేవలం 86 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ జరిగింది. ఇంకా 93 బస్సుల ఫిట్‌నెస్ పెండింగ్‌లో ఉన్నాయి.

బస్సులు జాగ్రత్తగా నడపాలి...

ప్రైవేటు పాఠశాలలు ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల కోసం బస్సులు నడుపుతున్నాయి. అయితే యాజమాన్యాలు ఫీజులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో.. బస్సులను కూడా అంతే జాగ్రత్తగా నడిపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా సంభవించే నష్టాన్ని ఎవరూ ఊహించలేరు. స్కూలు బస్సులు లేకపోతే బయట తిరిగే ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తారు. ప్రైవేటు బస్సుల్లో విద్యార్థుల ప్రయాణం అంత సేఫ్ కాకపోయినా చాలా మంది తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో పంపుతున్నారు. యేటా జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ప్రైవేటు పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ టెస్టు చేయించుకోవాలి. బస్సులు, వ్యాన్ల స్థితి సజావుగా ఉంటేనే విద్యార్థుల తరలింపునకు రవాణా శాఖ అధికారులు అనుమతిస్తారు.

స్కూల్ బస్సుల నిబంధనలు ఇలా...

- స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి.
- బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలి.
- డ్రైవర్ వయస్సు 60 ఏళ్లకు మించరాదు.
- డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- డ్రైవర్ కూర్చునే సీటు ముందు కాన్‌కేవ్ మిర్రర్ ఉండాలి. ఆ మిర్రర్‌లో బస్సులో ఉన్న వారందరూ కనిపిస్తారు.
- డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలి.
- ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండాలి..
- బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలి. బస్సులకు తలుపులు ఉండాలి.
- విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడూ, దిగేటప్పుడూ అటెండెన్స్ తీసుకోవాలి.
- ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
- అగ్నిమాపక పరికరం తప్పనిసరిగా ఉండాలి.

పాఠశాలల్లో ఇవి తప్పనిసరి...

పట్టణీకరణ నేపథ్యంలో చాలా ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రధాన రహదారి పక్కనే కొనసాగుతున్నాయి. వాటిలో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా పాఠశాలల యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి.
- పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారిపై ప్రత్యేక రంగులు వేయించాలి.
- విద్యార్థులున్నారనే సంకేతాన్ని డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి.
- తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో గేటు వద్ద రద్దీ లేకుండా చూడాలి.
- పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలి.

ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..

- జీవీఎస్ గౌడ్, డీటీవో, జనగామ



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి.

విద్యార్థుల భద్రత ప్రధానం..

- కె.రాము, డీఈవో, జనగామ



విద్యార్థులకు చదువు ఎంత అవసరమో అంతకన్నా స్కూల్ బస్సుల భద్రత ముఖ్యం. ఇంటి నుంచి బస్సులో పాఠశాలకు వచ్చినప్పటి నుంచి తిరిగి చేరే వరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

రేపటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి ఇంజనీరింగ్ కళాశాలల్లో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ఈసెట్-2024 కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని వరంగల్ జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు వారి వారి సమయానుసారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

'గులాబీ'కి మరో దెబ్బ!

(5వ పేజీ తరువాయి)

బీజేపీ అన్నట్టుగా రాజకీయాలు మారబోతున్నాయన్న అంచనాల నడుమ బీజేపీలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు హైదరాబాద్‌లో కాషాయ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. వచ్చే 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతందని, రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 119 నుంచి 175కు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ముందుగానే గోడ దూకి అసెంబ్లీ సీటుపై కర్చీఫ్ వేసుకోవాలనే ఆలోచనలో కొందరు గులాబీ నేతలు పక్కచూపులు చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. మొత్తానికి వరుస ఓటములు గులాబీ పార్టీకి కష్టకాలాన్నితెచ్చి పెట్టాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఈ కష్టకాలం నుంచి గట్టెక్కేందుకు గులాబీ బాస్ ఎలాంటి అడుగులు వేస్తారనేది ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసోంది.

గృహిణి అదృశ్యం

వరంగల్ క్రైం, జూన్ 8: కూతురితో కలిసి మాధవి అనే గృహిణి అదృశ్యమైన సంఘటన కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లో పెద్దకాసు శ్రీశైలం, మాధవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల కూతురు ఉంది. ఈనెల 6వ తేదీన మాధవి(26) తన కూతురుతో కలిసి ఇంట్లో సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో రెండు రోజుల పాటు వెతికిన శ్రీశైలం.. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రతీ సారి ఇదే తంతు

దొరికితేనే బయటపడుతున్న దొంగలు ● మూల్యాంకనంలో కొరవడిన నిఘా

అక్రమార్కులకు అందివస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8 : కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్న ప్రతీసారి జవాబు పత్రాలు బయటకు వెళుతున్నట్లు వర్సిటీ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ జరుగుతున్నప్పుడు నిఘా కొరవడుతుండటంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ క్యాంపులోకి ప్రైవేటు వ్యక్తులను దినసరి కూలీలను తీసుకుంటున్న కేయూ అధికారులు.. వారిపై పర్యవేక్షణ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతోనే వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. స్పాట్ క్యాంపులకు 25 మంది డెయిలీ వేజేస్ కింద నియమించుకుంటున్నారు. కోడింగ్ జరుగుతున్న క్రమంలో వారు పేపర్ బండిళ్లలోని పేపర్లను మాయం చేస్తూ బయటకు పంపిస్తున్నారు.

ఇందుకు ఒక్కో పేపర్‌కు రూ.5వేల నుంచి 10వేలు వసూల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిని అధికారులు గుర్తిస్తే తప్ప దొంగలు బయటపడటం లేదు. ప్రతీసారి స్పాట్ క్యాంపు నుంచి జవాబు పత్రాలు బయటకు తీసుకెళుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల తోడ్పాటు లేకుండా జవాబు పత్రాలు బయటకు ఎలా వెళ్లుతాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేస్తేనే అసలు నిజాలు బయట పడుతాయనే అభిప్రాయాలను వర్సిటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నిఘా వైఫల్యం.. పర్యవేక్షణ శూన్యం..

పరీక్షల విభాగంలోని స్పాట్ క్యాంప్‌ల్లో అధికారుల నిఘా వైఫల్యంతోనే తరుచూ జవాబు పత్రాలు బయటకు వెళుతున్నాయి. దినసరి వేతనం కింద నియమిస్తున్న ప్రైవేటు వ్యక్తులపై అధికారుల పర్యవేక్షణ శూన్యం కావడంతో వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. స్పాట్ క్యాంపుల్లో 25 మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పనులు చేస్తున్నారు. వీరంతా రోజుకు రూ.260 చొప్పున పనిచేస్తున్నారు. కోడింగ్ సమయాల్లో వీరిపై నిఘా కొరవడటంతో జవాబు పత్రాల బండిళ్ల తీస్తున్నప్పుడు వాటిల్లో నుంచి ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాలను తీసుకెళ్లి వారికి అందజేస్తున్నారు. వారు మళ్లీ జవాబులు రాసేందుకు అడిషనల్ పేపర్లు ఇచ్చి వారితో రాయించి ఆ పేపర్లను తిరిగి బండిళ్లలో సర్దుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులకు మాత్రం కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నిఘా నేత్రానికి దొరికితేనే దొంగలు

సీసీ కెమెరాల ఫుటేజీలో చూస్తేనే తప్ప.. దొంగలు బయట పడటం లేదు. నిరంతరం నిఘా ఉంచాల్సిన జవాబు పత్రాలు బయటకు వెళుతుంటే అధికారులకు మాత్రం కనిపించడం లేదు. రెగ్యులర్ ఉద్యోగుల భద్రతలో ఉండాల్సిన విద్యార్థుల భవితవ్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పరిహాసం అవుతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు బయట పడినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప.. అసలు సంఘటనలు జరుగకుండా పూర్తి స్థాయి భద్రత చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిఘా వైఫ్యలం, పర్యవేక్షణ కొరవడటంతోనే అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతూ డబ్బులు దండుకుంటున్న వారిపై నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

11 మంది.. 25 పేపర్లు..

కేయూలో జరిగిన సంఘటనలో మొత్తం 25 జవాబు పత్రాలు మార్పిడీ జరిగినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు.. మరో 8 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారిపై కేసు నమోదు చేశారు.

లెక్కతేలిన పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్

1,098 ఎల్పీ పోస్టులు, 265 పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో చేపడుతున్న భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ లెక్క తేలింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,231 భాషా పండితుల పోస్టులు ఉండగా, అందులో 1,098 పోస్టులు స్కూల్ అసిస్టెంట్(భాష) పోస్టులుగా ఉన్నతీకరణ కానున్నాయి. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 321 పీఈటీ పోస్టులు ఉండగా, అందులో 265 పోస్టులు పీడీలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,363 పోస్టులు అప్‌గ్రేడ్ కానున్నట్లు విద్యాశాఖ వివరాలు వెల్లడించింది.

తెలుగు భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	128	114
హనుమకొండ	103	92
జనగామ	115	102
జయశంకర్ భూపాలపల్లి	75	67
మహబూబాబాద్	149	133
ములుగు	57	51

హిందీ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	119	106
హనుమకొండ	108	96
జనగామ	111	99
జయశంకర్ భూపాలపల్లి	76	68
మహబూబాబాద్	126	112
ములుగు	57	51

ఉర్దూ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	2	2
హనుమకొండ	4	4
జనగామ	1	1

పీఈటీ అప్‌గ్రేడేషన్ ఇలా...

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	72	59
హనుమకొండ	74	61
జయశంకర్ భూపాలపల్లి	37	31
జనగామ	58	48
మహబూబాబాద్	58	48
ములుగు	22	18

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలను తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో తర్వాత ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

వైభవంగా వార కల్యాణం

చిలుపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చిన భక్తులు



కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, జూన్ 8: చిలుపూర్‌గుట్టలో శనివారం బుగులు వెంకన్న వార కల్యాణం కన్నులపండువగా జరిగింది. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారులు సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య ముందుగా స్వామి వారిని పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలలతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల సమక్షంలో ఉత్సవమూర్తుల కల్యాణం జరిపించారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు ముప్పిడి వెంకట్‌రెడ్డి - సుచరిత దంపతులు స్వామివారిని దర్శించుకుని రూ.15 వేల విలువ గల వెండి యజ్ఞోపవీతాన్ని అందజేశారు.

వరంగల్ సీపీ పూజలు..



కమిషనర్ దంపతులకు శేష వస్త్రాలను అందజేస్తున్న పూజారులు

బుగులు వెంకన్న దేవాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి రాగా ఈవో లక్ష్మీప్రసన్న ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న ఆయన తన సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. సీపీ వెంట జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ శ్రీనివాస్ యాదవ్, చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ ఉన్నారు. అనంతరం ఆలయ విశిష్టతతో పాటు, స్థల పురాణాన్ని వారికి వివరించారు. కమిషనర్ ఝా మాట్లాడుతూ, రాష్ట్రంలోనే రెండవ తిరుపతిగా విలసిల్లుతున్న వేంకటేశ్వర స్వామిని కుటుంబంతో కలిసి దర్శించుకోవడం మరచిపోలేని అనుభూతి అన్నారు.



పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం



కొడకండ్ల గురుకుల పాఠశాల ప్రధాన ద్వారం



విశాలమైన నూతన గ్రంథాలయం

వందశాతం ఉత్తీర్ణత.. ఇక్కడ ప్రత్యేకత

ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన ● పచ్చని చెట్లతో ఆశ్రమ వాతావరణం

ఆదర్శంగా నిలుస్తున్న కొడకండ్ల గురుకులం ● ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు

కొడకండ్ల జూన్ 8: సరైన సౌకర్యాలు, ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే ప్రభుత్వ పాఠశాల్లో కూడా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచవచ్చని కొడకండ్ల గురుకుల పాఠశాల నిరూపిస్తోంది. అటు పదో తరగతిలో, ఇటు ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ ప్రైవేటుకు దీటుగా నిలబడుతోంది. తెలంగాణాలోని 35 గురుకులాల్లో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది.

మండలకేంద్రంలో 2004-05 విద్యా సంవత్సరంలో అద్దెభవనంలో పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఈ బాలికల గురుకుల పాఠశాల ప్రారంభమైంది. 2008-09 విద్యా సంవత్సరంలో 7 ఎకరాల విశాలమైన స్థలంలో ప్రభుత్వం సొంత భవనం నిర్మించింది. నాటి నుంచి నేటివరకు ప్రిన్సిపాల్‌లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో వేలాది మొక్కలు నాటి సంరక్షించారు. ఇప్పుడు ఆ మొక్కలు పెరిగి వృక్షాలై ఆశ్రమ వాతారణాన్ని తలపిస్తున్నాయి. 2018-19 విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యను కూడా ప్రారంభించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది మారినా అదే క్రమశిక్షణ, నిబద్ధత కొనసాగుతుండటంతో ఈ పాఠశాలలో చదువుకుని వెళ్ళిన పూర్వవిద్యార్థులు ఎంతోమంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. గత విద్యా సంవత్సరంలో మొత్తం 597 మంది విద్యార్థులు పదవ తరగతి వరకు, 140 మంది ఇంటర్ విద్యార్థులు అభ్యసించారు. పదో తరగతిలో 69 మందికి 69 మంది అంటే వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 11 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. ఇంటర్లో 73 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం, 69 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

40 వేల పుస్తకాలతో గ్రంథాలయం..

గత విద్యాసంవత్సరంలో ప్రిన్సిపాల్ దిలీప్ ప్రత్యేక కృషితో అభయ ఫౌండేషన్ హైదరాబాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, గురుకుల సొసైటీల ఉమ్మడి సహకారంతో పాఠశాలలో విశాలమైన గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అకడమిక్ పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస తదితర 40 వేల పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. దాంతో విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకుని మంచి ఫలితాలను సాధిస్తున్నారు. విద్య మాత్రమే కాకుండా ప్రతీరోజు ఉదయం యోగా చేయిస్తుండటంతో విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు. సుడోకు పజిల్, ఆంగ్ల దిన పత్రికల పఠనం కూడా నిత్యం జరుగుతుండటంతో పలు విషయాలపై వారు అవగాహన పెంచుకుంటున్నారు. జిల్లా స్థాయిలో ఈ పాఠశాల విద్యార్థులు మాథ్స్ టాలెంట్ టెస్టులో ద్వితీయ స్థానం, సోషల్ టాలెంట్ టెస్టులో మొదటి స్థానం సాధించారు.

టీఎస్ఆర్ఎస్ విద్యార్థినని గర్వంగా చెప్పుకుంటాను..

అందె శోభ, పాలిటెక్నిక్ లెక్చరర్, మధిర



నిజంగా టీఎస్ఆర్ఎస్‌లో చదువుకోవడం వల్ల నేను ఈరోజు ఉన్నత స్థితిలో ఉన్నాను. నేను గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థినని చెప్పుకోవడానికి గర్వపడతాను. క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన వల్ల సబ్జెక్ట్‌పై పట్టు, విషయ అవగాహన బాగుటుంది. టీఎస్ఆర్ఎస్ ప్రాంగణం పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతారణంతో ప్రాచీన గురుకులాలను తలపిస్తుంది. నాలాగే ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పాఠశాలకు, ఉపాధ్యాయ సిబ్బందికి రుణపడి ఉన్నాం.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ..

దిలీప్ తమ్మి, ప్రిన్సిపాల్, టీజీఆర్ఎస్



వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వ్యక్తిగత శ్రద్ధతో సబ్జెక్ట్‌పై అవగాహన కల్పిస్తాం. విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతీరోజు ఉదయం యోగ, సుడోకు పజిల్‌ను ఆటలాగా ఆడిస్తాం. ఆంగ్ల దినపత్రికలు చదివిస్తాం. దీంతో విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన కలుగుతుంది. టైంటేబుల్ ప్రకారం విద్య, ఒక్కో విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడం వల్ల మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. ఇందులో ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి ఎంతో ఉంది. మా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నాం.

వివాహం కావడంలేదని..

యువకుడి ఆత్మహత్య



బాస్కుల భరత్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: వయసు మీరుతున్నా వివాహం కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామానికి చెందిన బాస్కుల భరత్ (35) అనే యువకుడు డిగ్రీ వరకు చదువుకొని ఖాళీగా ఉంటున్నాడు. తండ్రి నర్సయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా తల్లి యాదమ్మ కూలి పనులు చేస్తూ భరత్‌ను పెంచి పెద్దచేసింది. అయితే వయసు మీదపడుతున్నా పెళ్లి సంబంధాలు రాకపోవడంతో ఇక తనకు వివాహం కాదేమోనని బెంగతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి తలుపు తట్టగా ఎలాంటి స్పందన రాలేదు. కిటికీలోనుంచి చూడగా భరత్ స్లాబ్ కొక్కానికి వేలాడుతున్నాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి భరత్‌ను కిందకు దించి చూడగా అప్పటికే చనిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?

- తొర్రూరులో నిరుపయోగంగా ఉంటున్న పాఠశాల భవనం
- నిర్మించి ఏడేళ్లవుతున్నా నేటికీ అతీగతీ లేదు
- వినియోగంలోకి తేవాలంటున్న గ్రామస్థులు

పాలకుర్తి, జూన్ 8: పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. నిధులు ఖర్చవుతున్నాయే కాని పాఠశాలల్లో వసతులు మాత్రం మెరుగుపడడం లేదు. కొన్ని చోట్ల నూతన భవనాలు నిర్మించి ఏళ్ల తరబడి వదిలేసినా పట్టించుకునేవారు కరువయ్యారు. పాలకుర్తి మండ లం తొర్రూరులో ఏడేళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రూ. 28 లక్షలతో ఏడేళ్ల క్రితం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల కోసం భవనం నిర్మించారు. గుట్ట సమీపంలో అసైన్డ్ భూమిని కెటాయించి సర్వశిక్ష అభియాన్ పథకం కింద నిధులు మంజూరు చేశారు. నిర్మాణం పూర్తయినప్పటికీ కొన్ని వసతు లు కల్పించాల్సి ఉంది. విద్యుత్ కనెక్షన్, తాగునీటి వసతి కల్పించడంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. ప్రహరీ సైతం పూర్తి కాలేదు. పైగా పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారిలేదు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధు లకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఇప్పటికైనా అధికారులు స్పందిచి పాఠశాలలో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్యను వివరణ కోరగా.. నూతన భవనం నిర్మించినప్పటికీ పూర్తి స్థాయిలో వసతులు లేవని, అన్ని పనులు పూర్తి అయిన తర్వాత భవనాన్ని వినియోగంలోకి తెస్తామని అన్నారు.



పాలకుర్తి మండలం తొర్రూరులో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం

ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

(5వ పేజీ తరువాయి)

అనుమతిస్తారని, 9.30 గం.లకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభమవుతుందని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారని, ఉదయం 10 గం.ల తరువాత పరీక్షా హాలు లోకి అనుమతించరని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు ఉన్నందున చేతులకు మెహందీ, టాటూలతో హజరు కారాదు. అభ్యర్థులు షూస్, సాక్స్‌లు ధరించరాదు. కేవలం చెప్పులు మాత్రమే ధరించాలి. ఎలక్ట్రానిక్ మొదలగు ఇతర వస్తువులు అనుమతించరు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి: కలెక్టర్

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 563 గ్రూప్-1 పోస్టులకు గాను 3697 మంది హాజరవుతున్నారని అన్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్లింలతో మాట్లాడుతున్న ఏసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వార్

జనగామ కల్చరల్, జూన్ 8: బక్రీద్ పర్వదినాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని జనగామ ఏసీపీ అంకిత్ కుమార్ శంఖ్వార్ కోరారు. ఈ నెల 17న నిర్వహించే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జనగామ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మత సామరస్యాన్ని పాటించాలన్నారు. ఎలాంటి మత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ రాదన్నారు. శాంతియుతంగా పర్వదినాన్ని జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

చిన్న కుంటలో పెద్ద చేప



భారీ చేపను చూపుతున్న మత్స్యకారుడు గొడుగు అనిల్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: మండలంలోని మీదికొండ గ్రామంలోని పిల్లవానికుంటలో శనివారం మత్స్యకారులు చేపలు పడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన మత్స్యకారుడు గొడుగు అనిల్‌కు 15కిలోల బరువైన చేప లభ్యమైంది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఇంత భారీ చేప లభించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో కూడ ఇంత భారీసైజు చేపలు లభించడం లేదని తెలిపారు. చిన్నకుంటలో భారీ చేప లభించడం ఆనందంగా ఉందని అది మృగశిరకార్తె సందర్భంగా దొరకడం చాల సంతోషకరమైన విషయమని తెలిపారు.

మృగశిర మీనం.. జోరుగా విక్రయం



జఫర్‌గడ్ సెంటర్‌లో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

జఫర్‌గడ్/జనగామ కల్చరల్/స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: మృగశిర కార్తె ప్రారంభం కాగానే మాంసాహారులకు గుర్తుకు వచ్చేవి చేపలు. ఈ రోజున చేపలు తినాలనేది అనాదిగా వస్తున్న ఆచారం. దీంతో శనివారం మార్కెట్‌లో జోరుగా చేపల విక్రయాలు జరిగాయి. ధర ఎక్కువైనా కొనుగోలు దారులు లెక్కచేయకుండా తీసుకువెళ్లారు. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఎత్తున చేపలను కొనుగోలు చేశారు. మృగశిర కార్తె ప్రారంభ రోజున చేపలకు డిమాండ్ ఉంటుందని భావించి మత్స్యకారులు చేపలను ఎక్కువగా తీసుకువచ్చారు. మామూలు చేపలు రూ.140.లు, బొమ్మెలు, పచ్చి రొయ్యలు రూ.400.లకు కిలో చొప్పున విక్రయించారు. జఫర్‌గడ్ సెంటర్‌లో చేపల మార్కెట్ కిటకిటలాడింది. గ్రామాల్లో కుంటలు, చెరువుల కట్టల వద్ద కూడా ఉదయం నుంచి చేపల కొనుగోళ్ల సందడి కనిపించింది. కాగా, మృగశిర కార్తెలో చేపలను తినడం ద్వారా ఉబ్బసం వ్యాధితో పాటు పలు వ్యాధులు దరి చేరవని, ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో శుభదినాన రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి ప్రకృతికి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి వ్యవసాయ పనులను ప్రారంభించారు

స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో దేవాదుల రిజర్వాయర్ ఉండడంతో చేపల లభ్యత ఎక్కువ. అందువల్ల పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద చేపల విక్రయ కేంద్రం వద్ద శనివారం మృగశిరకార్తెను పురస్కరించుకొని వివిధ ప్రాంతాలకు చెందిన చేపల ప్రియులు పెద్ద ఎత్తున తరలివచ్చి చేపలను భారీ ఎత్తున కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు ఎక్కువ సంఖ్యలో రావడంతో చేపల ధరలను రెట్టింపు చేశారు.

రామోజీరావు మృతి కలచివేసింది

నివాళి అర్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రామోజీరావు మృతదేహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: రామోజీరావు మృతి తనను కలిచి వేసిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషన్ రామోజీరావు శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కడియం హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్దకు వెళ్లి పార్థీవదేహం వద్ద నివాళ్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ఎదిగిన దార్శినికుడు రామోజీరావు అని కొనియాడారు. మీడియారంగంలో, సినిమారంగంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు.

కవులు, కళాకారుల సంతాపం..

జనగామ కల్చరల్: తెలుగు రాష్ట్రాలలో జర్నలిజానికి వన్నె తెచ్చిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల జనగామ జిల్లా కవులు, కళాకారుల ఐక్యవేదిక శనివారం సంతాపం వ్యక్తం చేసింది. కృషి, పట్టుదల ఉంటే మనిషి ఏదైనా సాధించవచ్చు అనడానికి రామోజీరావు ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. నివాళులర్పించిన వారిలో జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, వేముల సదానందం, గడ్డం మనోజ్‌కుమార్, చిలుమోజు సాయికిరణ్, అంబాల శివనాథ్ గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ ఉన్నారు.

అయ్యో పాపం!

ఊరకుక్కల దాడిలో మృతి చెందిన బాలుడు



మృతిచెందిన బాలుడు గుగులోత్ అభిరామ్

చిలుపూర్, జూన్ 8: ముక్కుపచ్చలారని ఆరేళ్ల బాలుడిపై ఊరకుక్కలు దాడి చేశాయి. బాబు ఒంటరిగా ఉండడంతో మందగా వచ్చిన కుక్కలు మూకుమ్మడిగా కొరికి చంపేశాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుపూర్ మండలం ఫతేపూర్ పరిధిలోని లునావత్ తండాకు చెందిన గుగులోత్ మధు సరిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా చిన్నవాడైన అభిరామ్(6) శనివారం పొలం పనులకు వెళ్తున్న తల్లిదండ్రుల వెంట వెళ్ళాడు.

అయితే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తండ్రి బాలుడిని తీసుకొచ్చి తండా సమీపంలో వదిలేసి ఇంటికి వెళ్లమని చెప్పి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలుడు కనిపించలేదు. చుట్టుపక్కల ఇళ్ళల్లో వెతికినా ఆచూకి లభించలేదు. చివరికి పొలం దగ్గరికి వెళ్ళే మార్గంలో వెతుకుతుండగా పక్కనే ఉన్న వాగులో బాలుడు విగతజీవిగా పడి ఉన్నాడు. ఒంటిపై తీవ్రమైన గాట్లు ఉండడం, సమీపంలో కుక్కలు మంద కనిపించడంతో వాటి పనేనని భావించి బోరున విలపించారు. తమ వెంట తీసుకెళ్లినా బాగుండేదంటూ గుండెలు బాదుకున్నారు. వారు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

కొనసాగుతున్న బడిబాట

కొడకండ్ల/పాలకుర్తి, జూన్ 8: కొడకండ్లలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దోర్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అన్ని సౌకర్యాలతో పాటు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ సిబ్బందితో నాణ్యమైన విద్య లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సైదమ్మ, ఉపాధ్యాయులు కుసుమ రాజు, అంగన్వాడి టీచర్లు నర్సమ్మ, వినోద, ఆశా కార్యకర్తలు యాకమ్మ, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా పాలకుర్తి మండలం తీగారంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు రెండు జతల దుస్తులు, పుస్తకాలు, నోటు బుక్స్ ఉచితంగా అందిస్తామని అన్నారు. ర్యాలీలో నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, ఎంపీటీసీ సోమయ్య, మాజీ సర్పంచు రాజేశ్వరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొడకండ్లలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎంపీ కావ్యను కలిసిన ఐఎన్‌టీయూసీ నేతలు



కడియం కావ్య, శ్రీహరిని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: వరంగల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన డాక్టర్ కడియం కావ్యను, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హన్మకొండలోని వారి నివాసంలో శనివారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కావ్యకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, కంపెనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సంఘం వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సదయ్య, ఓదేలు, జనగామ జిల్లా కార్యదర్శి సీహెచ్ నరేందర్ రెడ్డి, డివిజన్ కార్యదర్శి రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు లాక్కెళ్లిన దుండగులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: రోడ్డు పక్కన నేరేడు పండ్లు అమ్ముకుంటున్న అన్నెపు ప్రమీల అనే మహిళ మెడలో నుంచి దుండగులు పుస్తెలతాడు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్ గ్రామానికి చెందిన ప్రమీల గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన శనివారం నేరేడుపండ్లు విక్రయిస్తోంది. ఈ క్రమంలో హన్మకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ప్రమీల వద్ద నిలిపారు. అందులో నుంచి ముగ్గురు వ్యక్తులు దిగి బేరమాడారు. పథకం ప్రకారం ఆమెను మాటల్లో పెట్టి రహదారి వెంట ఎవరూ లేని సమయంలో మెడలో నుంచి పుస్తెలతాడు లాగారు. ఆమె అడ్డుకోవడంతో జరిగిన పెనుగులాటలో పుస్తెలతాడు సగానికి తెగిపోయింది. ఆ సగం తాడును పట్టుకొని దుండగులు కారులో పారిపోయారు. ఈ విషయమై ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు తులాల పుస్తెలతాడులో సగం దుండగులు ఎత్తుకెళ్లారని తెలిపింది. సీఐ ముస్క రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లింగంపల్లిలో బొడ్రాయికి పూజలు



గ్రామదేవతల వద్ద పూజలు చేస్తున్న గ్రామస్థులు

చిలుపూర్, జూన్ 8 : మండలంలోని లింగంపల్లిలో బొడ్రాయి (గ్రామ దేవత)కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమిటీ ప్రతినిధుల గంగుల సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏదునూరి రవిందర్ నేతృత్వంలో పూజారి సంతోష్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలంతా అమ్మవారికి జలాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. కంకటి రవిందర్, రచ్చ రవిందర్, మాజీ ఉప సర్పంచ్ కంకటి రాజన్న, కండ్లకోలు శ్రీనివాస్, మాటూరి శ్రీనివాస్, వద్దుల కుమార్, బాలగోని భాగ్యలక్ష్మి, కంకటి భాగ్యలక్ష్మి, గాజుల రజని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 8: పల్లగుట్ట క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుకాల నుంచి బైక్ ఢీకొట్టగా శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తికి తీవ్రగా యాలయ్యాయి. రాజమండ్రికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ పట్టణంలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమ్మితం శనివారం వరంగల్ నుంచి జనగామ వైపు బైక్‌పై వెళ్లుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. సీఐ ముస్క రాజు, ఎస్సై వినయ్‌కుమార్ అక్కడికి చేరుకొని బాధితుడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు.